
సాక్షి కర్నూలు

బుధవారం । 28 । జూన్ । 2023



జీడీపీలో 1.4 టీఎంసీల నీరు

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టులో మంగళవారం 1.4 టీఎంసీల నీరు నిల్వ ఉంది. తాగునీటి అవసరాల కోసం పత్తికొండ, డోన్, క్రిష్ణగిరి మండలాలకు నీరు విడుదల కొనసాగుతోంది.



అలరించిన సంగీత విభావరి

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిత్యకళావేదికపై అనంతపురానికి చెందిన పి.అనిత వారి భక్తి సంగీత విభావరి భక్తులను అలరించింది.



శాకాంబరీ దేవిగా కొలనుభారతి

కొత్తపల్లి: కొలనుభారతిదేవి క్షేత్రంలో అమ్మ వారు మంగళవారం భక్తులకు శాకాంబరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

44 మంది పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల బదిలీ



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ వేణుగోపాల్, ఇతర అధికారులు

కర్నూలు కల్చరల్: జిల్లాలోని పలు యాజమాన్యాల పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లను బదిలీ చేశారు. మంగళవారం సమగ్ర శిక్షా కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి వి.రంగారెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ వేణుగోపాల్, ఏవో రాజేశ్వరి దేవి, ప్రభుత్వ డైట్ కళాశాల అధ్యాపకులు జనార్థన్‌రెడ్డి, ఏఎమ్‌ఓ ప్రసాద్‌లు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆర్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి 26 మంది దరఖాస్తు చేసుకోగా 12 మంది, వర్క్ ఎడ్యుకేషన్‌కు 28 మందికి 21 మంది, హెల్త్ ఎడ్యుకేషన్‌కు 14 మందికి 11 మంది పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు బదిలీలకు దరఖాస్తు చేసుకోగా 44 మంది బదిలీ అయ్యారు.

ఎన్‌పీసీఐ మ్యాపింగ్ ఉంటేనే 'విద్యా దీవెన'

కర్నూలు(అర్బన్): జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జె.రంగలక్ష్మిదేవి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఇంకా 126 మంది ఎస్సీ విద్యార్థులు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేసుకోలేదని, వీరంతా ఈ నెల 28లోగా పోస్టాఫీసుల్లో రూ.200 చెల్లించి ఖాతా ఓపెన్ చేసుకోవాలన్నారు. ఖాతాకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) వర్తించేలా మ్యాపింగ్ చేయించుకోవాలన్నారు. అలాగే అమ్మ ఒడికి సంబంధించి ఇంకా 2,762 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు కూడా ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేసుకోలేదన్నారు. వీరు కూడా పోస్టాఫీసుల్లో ఖాతా ఓపెన్ చేసుకొని డీబీటీ వర్తించేలా మ్యాపింగ్ చేయించుకోవాలన్నారు. లేని పక్షంలో ఈ విద్యా సంవత్సరంలో అమ్మఒడికి అనర్హులవుతారని తెలిపారు.

వైఎస్‌ఆర్ పెన్షన్ కానుకకు రూ.124.96 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): జూలై నెల వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పంపిణీకి సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాకు ప్రభుత్వం మంగళవారం రూ.124,96,88,250 విడుదల చేసింది. కర్నూలు జిల్లాలో 2,36,767 పింఛన్లకు రూ.65,83,29,750, నంద్యాల జిల్లాలో 2,14,259 పింఛన్లకు రూ.59,13.58,500 పంపిణీ చేయనున్నారు. 1వ తేదీ నుంచి పింఛన్ల పంపిణీకి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక నిధులను ప్రభుత్వం 12 బ్యాంకులకు విడుదల చేసింది. వార్డు, గ్రామ సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సంబంధిత బ్యాంకుల నుంచి ఈ నెల చివరిలోపు డ్రా చేస్తారు. పింఛన్ల పంపిణీకి అవసరమైన నిధులను సిద్ధం చేసుకోవాలని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య బ్యాంకర్లకు సూచించారు.

2న ఈత జట్టు ఎంపిక పోటీలు

కర్నూలు (రూరల్): జిల్లా ఈత జట్టు ఎంపిక పోటీలు వచ్చే నెల 2 వ తేదీ ఉదయం 9:30 గంటలకు కర్నూలు నగరంలోని కిసాన్ ఘాట్ దగ్గర ఉన్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఈత కొలనులో నిర్వహించనున్నారు. బాల, బాలికలకు వేర్వేరుగా ఈ పోటీల్లో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు నరసింహయ్య ఆచారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10 నుంచి 17 సంవత్సరాల (2006 నుంచి 2013 మధ్య జన్మించిన) లోపు వారికి పోటీలు జరుపుతామన్నారు. మంచి ప్రతిభ కనబరిచిన వారు జూలై 8,9 తేదీల్లో జరిగే 8వ అంతర్ జిల్లా సబ్ జూనియర్ పోటీలో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల బాల, బాలికలు ఆధార్ కార్డ్‌తో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9154076117 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

మల్లన్నను దర్శించుకున్న మంత్రులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను మంగళవారం ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు, మున్సిపల్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. రాజగోపురం వద్ద మంత్రులకు దేవస్థాన ఈఓ ఎస్.లవన్న, అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం మంత్రులకు ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.

అమ్మఒడి సాయం.. విద్యా వికాసం

పిల్లల బంగారు భవిష్యత్తుకు చదువే ఆస్తి అంటారు. అలాంటి ఆస్తిని పేద పిల్లల దరికి చేర్చే బాధ్యతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భుజానికెత్తుకున్నారు. పైసా ఖర్చులేకుండా నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తున్నారు. పిల్లలను బడికి పంపించే తల్లిదండ్రులకు అమ్మఒడి పథకం ద్వారా సాయం అందజేస్తూ ప్రోత్సహిస్తున్నారు. -కర్నూలు కల్చరల్



- నేడు నాలుగో విడత అమ్మఒడి పథకం నిధుల జమ
- జిల్లాలో 2.42 లక్షల మంది అర్హత
- తల్లుల ఖాతాల్లో జమ కానున్న రూ. 314.913 కోట్లు
- ఇప్పటికే గ్రామ/వార్డు సచివాలయాల వారీగా అర్హుల జాబితా ప్రదర్శన
- జిల్లాస్థాయిలో ఆర్ కాలనీ జెడ్పీహెచ్‌ఎస్‌లో అమ్మఒడి కార్యక్రమం

జగనన్న అమ్మ ఒడి పథకాన్ని వరుసగా నాలుగో ఏడాది అమలు చేయనున్నారు. ఇప్పటికే అర్హుల జాబితాను ప్రభుత్వం ప్రకటించింది. గ్రామ/వార్డు సచివాలయాల్లో వాటిని ప్రదర్శిస్తున్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 1 నుంచి ఇంటర్ వరకు చదువుతున్న పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 15 వేల చొప్పున ప్రభుత్వం సాయం మంజూరు చేస్తోంది. ఇందులో పాఠశాల, మరుగుదొడ్ల నిర్వహణ నిధికి రూ. 2వేలు మినహాయించి మిగతా రూ. 13 వేలు తల్లి ఖాతాలో వేస్తారు. ఈ ఏడాది ఈ పథకానికి జిల్లాలో 2,42,241 మంది అర్హత సాధించారు. వీరికి రూ. 314.913 కోట్లు జమ కానున్నాయి.

నేడు బటన్ నొక్కనున్న సీఎం

అమ్మఒడి పథకం లబ్ధిదారుల ఖాతాల్లో నేడు సొమ్ము జమ కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్వతీ పురం మన్యం జిల్లా కురుపాంలో బటన్‌నొక్కి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. జిల్లాకు సంబంధించి అధికారిక కార్యక్రమం కర్నూలు మండల పరిధిలోని ఆర్.కాలనీ జెడ్పీహెచ్ స్కూల్‌లో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు. జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, డీఈఓ డాక్టర్ రంగారెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ వేణుగోపాల్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

అమ్మ ఒడి ఆర్థిక ప్రయోజనాన్ని అందుకునేందుకు ఉద్దేశించిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా నిర్వహించింది. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా వలంటీరుల క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వెళ్లి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ ప్రభుత్వం అందించే లబ్ధికి దూరం కాకూడదనే సదుద్దేశంతో ఎంపిక ప్రక్రియను చేపట్టారు. వలంటీర్లు రెండు రోజులుగా తమ పరిధిలోని విద్యార్థుల తల్లుల అథంటిఫికేషన్ నమోదు చేశారు.



2019-2020 నుంచి ఇప్పటి వరకు అమ్మఒడి పథకం లబ్ధిదారులు, సాయం వివరాలు

విద్యా సంవత్సరం	తల్లుల సంఖ్య	ఆర్థిక లబ్ధి
2019-2020	3,33,662	రూ. 566.49 కోట్లు
2020-2021	4,12,884	రూ. 619.326 కోట్లు
2021-2022	4,14,767	రూ. 539.19 కోట్లు
2022-2023	2,42,241	రూ. 314.913 కోట్లు

వారం రోజుల పాటు అమ్మ ఒడి వారోత్సవాలు

అమ్మ ఒడి వారోత్సవాలను వారం రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు జిల్లాలోని ప్రతి మండల కేంద్రం, మున్సిపాలిటీల్లో 'అమ్మ ఒడి' కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహించనున్నారు. వారోత్సవాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎమ్మెల్యేలు, మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు పాల్గొనున్నారు.

అందరూ చదువుకోవాలని..



ప్రతి ఒక్కరూ చదువుకోవాలని ప్రభుత్వం అమ్మఒడి పథకం కింద సాయం అందజేస్తోంది. ఇప్పటి వరకు మూడు విడతలు అందజేసింది. నేడు నాలుగో విడత సొమ్మును విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయనుంది. ఈ ఏడాది జిల్లాలో 2,42,241 మంది అమ్మఒడి పథకానికి అర్హత సాధించారు. ఏటా ఈ పథకం కింద ప్రభుత్వం చేసే సాయం విద్యార్థుల చదువుకు దోహద పడుతుంది.

– వి.రంగారెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

కర్ణాటకకు వెళ్లి.. ఈకేవైసీ

హొళగుంద: అమ్మ ఒడి పథకానికి అర్హత పొందిన లబ్ధిదారుల ఈకేవైసీ నమోదు గత మూడు రోజుల నుంచి ముమ్మరంగా సాగుతోంది. మంగళవారం హొళగుంద మండలం హెబ్బటం గ్రామానికి చెందిన వలంటీరు బీమప్ప కర్ణాటకకు వెళ్లి లబ్ధిదారురాలితో ఈకేవైసీ నమోదు చేయించాడు. గ్రామానికి చెందిన హరిజన అంజినమ్మ, గోరంట్లప్పకు ఇద్దరు కుమార్తెలు. మొదటి కుమార్తె హరిజన మౌనిక హెబ్బటం హైస్కూల్‌లో 10వ తరగతి చదువుకుంటుంది. అంజినమ్మ నెల క్రితం మరో బిడ్డకు జన్మ ఇచ్చింది. ఆ శిశువు ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో గత నెల 23 నుంచి బెంగళూరు విక్టోరియా హాస్పిటల్‌లో చికిత్స చేయిస్తున్నారు.



బెంగళూరు విక్టోరియా హాస్పిటల్‌లో విద్యార్థిని తల్లికి ఈకేవైసీ చేస్తున్న వలంటీర్ బీమప్ప

ఈకేవైసీ గడువు ముగిస్తుండడంతో వలంటీరు బీమప్ప తన సొంత ఖర్చుతో బెంగళూరుకెళ్లి ఈ ప్రక్రియను పూర్తి చేశాడు. దీంతో నేడు ఆమెకు అమ్మఒడి సాయం అందనుంది.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు(సెంట్రల్): డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునే గడువును జూలై 5వ తేదీ వరకు పొడిగించినట్లు క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్‌హెచ్‌ఈ మార్గదర్శకాల మేరకు అడ్మిషన్ల ప్రక్రియలో సలహాలు, సందేహాల నివృత్తి కోసం బీక్యాంపులోని క్లస్టర్ యూనివర్సిటీలో హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 9949899621, 9490484188, 8008816050 నంబర్లకు సంప్రదించాలని ఆయన విద్యార్థులకు సూచించారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు కల్చరల్: జిల్లాలో ఏపీఓఎస్‌ఎస్ ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 7 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మంగళవారం పదో తరగతికి సంబంధించి ఏడుగురికి గాను 6 మంది, ఇంటర్ పరీక్షలకు 245 మందికి గాను 210 మంది హాజరైనట్లు డీఈఓ వి.రంగారెడ్డి తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పరీక్ష కేంద్రాలను సందర్శించి తనిఖీ చేశాయన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

శ్రీ మఠం హుండీ ఆదాయం రూ.2.89 కోట్లు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠం జూన్ నెల 27 రోజుల హుండీ ఆదాయం రూ 2.89 కోట్లు సమకూరినట్లు శ్రీ మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాస రావు తెలిపారు. మంగళవారం భక్తుల ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కొనసాగింది. హుండీ లెక్కింపుల్లో భాగంగా భక్తులు స్వామి వారికి కానుకలు, నగదు రూపంలో రూ 2,84,12,635 కాయిన్స్ రూ 5,83,660, బంగారు 57 గ్రాములు, వెండి 910 గ్రాములు చెల్లించినట్లు వివరించారు.



నగదు లెక్కింపులో భక్తులు

పర్యావరణహిత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుదాం

- జిల్లాలో వివిధ పర్యాటక ప్రాజెక్టులకు 15 రోజుల్లో డిజైన్‌లు, డీపీఆర్‌లను పంపండి
- రూ.10 కోట్లతో విజయవనం అభివృద్ధికి చర్యలు
- అడ్వెంచర్ టూరిజంగా ఓర్వకల్‌ను తీర్చిదిద్దాలి
- జిల్లా అధికారులతో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



పర్యాటక రంగం అభివృద్ధిపై జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): జిల్లాను పర్యావరణహిత పర్యాటక నిలయంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వివిధ పర్యాటక ప్రాజెక్టుల డిజైన్లు, డీపీఆర్‌లను 15 రోజుల్లో పంపితే నిధులు మంజూరు చేస్తానని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కర్నూలు వచ్చిన మంత్రి పోలీసు గెస్టు హౌస్‌లో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్, జేసీ నారపురెడ్డి మౌర్య, డీఎఫ్‌ఓ శివశంకర్‌రెడ్డి, జిల్లా టూరిజం అధికారి విజయ, డివిజనల్ మేనేజర్ చంద్రమౌళితో ప్రత్యేకంగా సమావేశమై టూరిజం అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కర్నూలు శివారు ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న విజయవనంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విజయవనాన్ని ఆధునిక హంగులతో అభివృద్ధి చేసేందుకు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపాలన్నారు. వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు, యోగా సెంటర్, స్క్రీన్ , సౌండ్ అండ్ లైట్ వ్యవస్థతో ఆంఫిథియేటర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. వాకింగ్ ట్రాక్‌ను సిమెంట్‌కు బదులుగా మట్టితో పూర్తి చేయాలన్నారు. విజయవనం పార్కును అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ఢిల్లీలోని నెహ్రూ, లోధి గార్డెన్, హైదరాబాద్‌లోని పాలపిట్ట, కేబీఆర్ పార్కులను సందర్శించి ఉత్తమమైన డిజైన్లను రూపొందించాలన్నారు. విజయవనం పార్కు పనులు వేగంగా జరిగేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా డెవలప్‌మెంట్ సొసైటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు.అలాగే పార్కు పక్కనే టూరిజం శాఖకు సంబంధించిన 10 ఎకరాల విస్తీర్ణంలో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడే వే సైడ్ రెస్టారెంట్, ఇతర పర్యాటక వసతులు కల్పించాలని టూరిజం శాఖ అధికారులకు ఆదేశించారు.

అడ్వెంచర్ టూరిజం స్పాట్‌గా ఓర్వకల్

రాక్ క్లైంబింగ్, స్కై సైక్లింగ్ వంటి సాహస క్రీడలతో ఓర్వకల్‌ను అడ్వెంచర్ టూరిజం స్పాట్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన మంత్రికి వివరించారు. విజయవనం, ఓర్వకల్ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా ఆర్కిటెక్‌ను నియమించి 15 రోజుల్లోపు డిజైన్‌లు, డీపీఆర్‌లను రూపొందించనున్నట్లు ఆమె తెలిపారు.

కోవెలకుంట్ల విద్యుత్ ఏఈపై వేటు

- అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఫిర్యాదులు
- ప్రైవేటు వెంచర్లలో అనధికారికంగా లైన్ షిఫ్టింగ్ పనులు
- సంస్థకు చెందిన రూ.50లక్షల సామగ్రి వినియోగించినట్లు ఆరోపణలు
- ఎస్‌ఈ ఉమాపతి విచారణ.. సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సీఎండీ

కర్నూలు(రాజ్‌విహార్): నంద్యాల జిల్లా (కర్నూలు సర్కిల్) కోవెలకుంట్ల మండలం విద్యుత్ ఆపరేషన్స్ ఏఈ బి.రామ సుబ్రహ్మణ్యంపై సస్పెన్షన్ వేటు పడింది. అధికార దుర్వినియోగం, ఇతర పలు ఆరోపణల కారణంగా ఆయనను సస్పెండ్ చేస్తూ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అధికారుల వివరాల మేరకు... కొంత కాలంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ఏఈ రామ సుబ్రహ్మణ్యం కోవెలకుంట్ల పరిధిలోని ప్రైవేటు వెంచర్లు, ప్లాట్లలోని విద్యుత్ స్తంభాలు, తీగలు (లైన్ షిఫ్టింగ్)ను అనధికారికంగా మార్చారు. వాస్తవంగా లైన్ షిఫ్ట్‌కు ప్లాట్ లేదా వెంచర్ యజమాని దరఖాస్తు చేసుకోవాలి. ఆ లైన్‌ను బట్టి ఏఈ/ఏడీఈ/ఈఈ వెళ్లి పరిశీలించాక ఎస్టిమేషన్ (అంచనా) వేయాలి. ఆ అంచనా డబ్బును దరఖాస్తుదారులు చెల్లించాక పని మంజూరు చేయాలి. అయితే, ఇవేవి లేకుండానే ఆ ఏఈ పనులు పూర్తి చేసేశారు. అయితే వీటి కోసం సంస్థకు చెందిన సామగ్రితో పాటు రైతులు, ఇతర వర్గాల వినియోగదారులకు మంజూరు అయిన మెటీరియల్‌ను వాడారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి ఈ నెల 24వ తేదీన అక్కడికి వెళ్లి విచారణ జరపగా.. అనేక వాస్తవాలు వెలుగుచూశాయి. సుమారు 10 వెంచర్లు, ప్రైవేటు ప్లాట్లలో అనధికారికంగా పలు పనులు చేపట్టినట్లు తెలిసింది. ఇందుకు సంస్థకు చెందిన సుమారు రూ.50 లక్షల విలువైన స్తంభాలు, వైర్లు, ఇతర మెటీరియల్‌ను వినియోగించాడు. ప్రతిఫలంగా వచ్చిన సొమ్ముతో తన జేబులు నింపుకున్నట్లు విద్యుత్ శాఖలో చర్చ జరుగుతోంది. ఇవే కాక ఏఈ పనితీరుపై గతంలో అనేక ఫిర్యాదులు, ఆరోపణలొచ్చాయి. ఉన్నతాధికారులు హెచ్చరిస్తూ వస్తున్నా ఆయనలో మార్పురాకపోవడంతో ఏఈ రామ సుబ్రహ్మణ్యంను సస్పెండ్ చేస్తూ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ప్రైవేటు ప్లాట్లు, వెంచర్లలో అనధికారికంగా చేసిన లైన్ షిఫ్టింగ్ పనులకు వినియోగించిన విద్యుత్ స్తంభాలు, వైర్లు, ఇతర సామగ్రి ఎలా వచ్చింది? ఎవరు సరఫరా చేశారు? వాటి విలువ ఎంత? అతనితో పాటు ఇందులో ఎంత మంది పాత్ర ఉంది? ఇలా పలు కోణాల్లో విజిలెన్స్ విభాగం విచారణ చేస్తున్నట్లు సమాచారం.

తెల్ల బంగారం ధర తగ్గుముఖం



ఆదోని అర్బన్ : ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పత్తి ధర రోజురోజుకు తగ్గుతూ వస్తోంది. గత వారంలో రూ.7,300 ధర పలకగా, ఈ వారం రూ.6,800గా నమోదైంది. మంగళవారం 943 క్వింటాళ్ల పత్తి రాగా, గరిష్ట ధర రూ.6,800, మధ్య ధర రూ.6,569, కనిష్ట ధర రూ.4,509 పలికింది.

జోరుగా సూక్ష్మ సేద్యం మంజూరు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో సూక్ష్మ సేద్యం మంజూరు ప్రక్రియ ఊపందుకుంది. సూక్ష్మ సేద్యం మంజూరు, మెటీరియల్ సప్‌లై చేయడంలో రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా రెండవ స్థానంలో నిలిచింది. 2023–24లో జిల్లాలో 5వేల హెక్టార్లకు సూక్ష్మ సేద్య సదుపాయం కల్పించాలనేది లక్ష్యం. ఇప్పటి వరకు 9,427 మంది రైతులు 10,474.7 హెక్టార్లకు సూక్ష్మ సేద్యం కోసం ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. సూక్ష్మసేద్యం కంపెనీల ప్రతినిధులు, ఏపీఎంఐపీ సిబ్బంది ఇప్పటి వరకు 2,926 మంది రైతులకు సంబంధించి 2,855.25 హెక్టార్లకు సాగులోని పంటల ఆధారంగా సబ్సిడీ, నాన్ సబ్సిడీలపై ఎస్టిమేట్లు వేశారు. 525 మంది రైతులు 458.53 హెక్టార్లకు సూక్ష్మ సేద్యం కోసం నాన్ సబ్సిడీ కూడా చెల్లించారు. 351 మంది రైతులకు సంబంధించి 302.03 హెక్టార్లకు జిల్లా కలెక్టర్ సృజన సూక్ష్మ సేద్యం మంజూరు చేశారు.

రాష్ట్రంలో క్రైం రేట్ తగ్గింది

- శాంతి భద్రతలపై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు
- వారికి ఆధారాలతో సమాధానమిస్తాం
- దిశ యాప్ మహిళలకు రక్షణ
- ఉమ్మడి జిల్లాలో గణనీయంగా తగ్గిన నేరాలు
- డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి వెల్లడి



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(టౌన్): "రాష్ట్రంలో క్రైమ్ రేట్ తగ్గింది. 2014 నుంచి 2019 వరకు క్రైమ్ రేట్‌తో పోలిస్తే 2020 నుంచి 2023 మే వరకు రాష్ట్రంలో నేరాలు గణనీయంగా తగ్గాయి. క్రిమినల్స్‌ను కంట్రోల్ చేయడంతోనే క్రైమ్ కంట్రోల్‌లో ఉంది. హత్యలు, హత్యా యత్నాలు తగ్గాయి. శాంతిభద్రతల విషయంలో ఇతరులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. అలా చేసిన వారికి ఆధారాలతో సమాధానం ఇస్తాం".. అని రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టంచేశారు. కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి జిల్లా స్థాయి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది నేరాలు గణనీయంగా తగ్గాయి. మహిళా పోలీసుల సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మహిళా పోలీసులవల్ల గుర్తుతెలియని మృతదేహాలను గుర్తిస్తున్నాం. బాల్య వివాహాలు తగ్గాయి. మహిళలు, చిన్న పిల్లలపై అత్యాచారాలు వంటి తీవ్రమైన కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ కేసుల్లో ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో అనేక కేసుల్లో జీవిత ఖైదు, అంతకంటే ఎక్కువ శిక్షలు పడేలా పోలీసు శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తూ తక్కువ వ్యవధిలో కేసులను పరిష్కరిస్తోంది. వాహనాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్, అవగాహన సదస్సులు, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంటు పెంచుతూ రోడ్డు ప్రమాదాలను అరికడుతున్నాం. రాష్ట్ర పోలీసులు, గ్రామీణ మహిళా పోలీసులు, వార్డు మహిళా పోలీసులు అందరూ కలిసికట్టుగా గ్రామాల్లో తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. దీనివల్ల గ్రామాల్లో గొడవలు, దొమ్మి కేసులు, కుటుంబ కలహాల కేసులు బాగా తగ్గాయి.

మహిళలకు రక్షణగా దిశ..

ఇక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన దిశా యాప్‌ను రాష్ట్రవ్యాప్తంగా మహిళల మొబైల్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసి అవగాహన కల్పిస్తున్నాం. పోలీసులు సైతం మహిళల రక్షణకు నిరంతరం కృషిచేస్తున్నారు. మహిళలకు, మైనర్ బాలికలకు దిశ యాప్ రక్షణగా నిలుస్తోంది.

డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా తీర్చిదిద్దుతాం

యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా పోలీసుశాఖ తయారీదారులు, అమ్మకందారులపై కఠిన చర్యలు తీసుకుంటోంది. సదరు వ్యక్తులపై పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నారు. మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించడంతో పాటు డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి వారిపై పీడీ యాక్టులు పెడుతూ అవసరమైతే నగర బహిష్కరణకు గురిచేస్తున్నారు. ఈ సమావేశంలో కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, నంద్యాల ఎస్పీ కె. రఘువీరారెడ్డి, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పాల్గొన్నారు.

సీపీఆర్‌కు పీఎస్‌ల వివరాలు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్(సీపీఆర్) ఆదేశాల మేరకు జిల్లాలో ఈఓఆర్‌డీ పదోన్నతులకు అర్హత కలిగిన పంచా యతీ కార్యదర్శుల వివరాలను పంపుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీడీఓ నుంచి గ్రేడ్ -1 పంచాయతీ కార్యదర్శులుగా 22 మంది, గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1కు పదోన్నతి పొందిన వారు 13 మంది, గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులు 7గురు ఉన్నారన్నారు. వీరు ఎప్పుడు ఉద్యోగంలో చేరారు? సర్వీసు క్రమబద్ధీకరణ? కేసులు? కమ్యూనిటీ? తదితర వివరాలను వెంటనే పంపించాల్సి ఉందన్నారు. ఇటీవల జోన్-4 పరిధిలో పలువురు ఈఓఆర్‌డీలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పించిన నేపథ్యంలో అర్హులైన పంచాయతీ కార్యదర్శులకు ఈఓఆర్‌డీలుగా పదోన్నతి కల్పించేందుకు ఈ వివరాలు అవసరమన్నారు.

అర్బన్ కార్డులకు కేజీ ఫోర్టిఫైడ్ చక్కీ గోధుమ పిండి

కర్నూలు(సెంట్రల్): జూలై మాసం నుంచి కార్పొరేషన్, మునిసిపాలిటీ, నగర పంచాయతీల్లోని అర్బన్ కార్డుదారులకు కేజీ ఫోర్టిఫైడ్ చక్కీ గోధుమ పిండి సరఫరా చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేజీ గోధుమ పిండికి రూ.16 చెల్లించాలన్నారు. కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్, ఎమ్మిగనూరు, ఆదోని మునిసిపాలిటీలు, గూడూరు నగర పంచాయతీల్లోని కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెద్దాసుపత్రిలో క్యాన్సర్ కేర్ బృందం పర్యటన


వివరాలు తెలుసుకుంటున్న బృందం సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మంగళవారం ఏపీ సమగ్ర క్యాన్సర్ కేర్ సభ్యుల బృందం పర్యటించింది. బృందంలో ఏపీ స్టేట్ క్యాన్సర్ కేర్ నోడల్ అధికారి రమేష్‌బాబు, ఏపీ ప్లానింగ్ అండ్ డిజైనింగ్ కన్సల్టెంట్ దేవరాజ్ సింగ్, ఏపీఎంఎస్ఐడీఈ కన్సల్టెంట్ రణధీర్ పాటక్, ఏపీఎంఎస్ఐడీసీ బయోమెడికల్ ఇంజనీర్ సందీప్‌రెడ్డి, ఎస్ఈ రమేష్‌రెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి ఉన్నారు. ఈ బృందం స్టేట్ క్యాన్సర్ యూనిట్ ఓపీ, ఐపీ విభాగాల పనులను పరిశీలించారు. యూనిట్‌లోని నీటి వసతి పైప్‌లైన్ వర్క్స్ తదితర అంశాలపై ఆరా తీశారు. సివిల్ వర్క్స్, బిల్డింగ్ పనుల పురోగతిని తెలుసుకున్నారు. పూర్తిస్థాయి భవన నిర్మాణ పురోగతి, కార్యాచరణ, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను చర్చించారు. నవంబర్‌లోపు స్టేట్ క్యాన్సర్ యూనిట్ పూర్తి చేయాలని సూచించారు. వీరి వెంట ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఎంవో వెంకటరమణ, క్యాన్సర్ విభాగం హెచ్ఓడి డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థి బలవన్మరణం

బనగానపల్లెరూరల్: నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని రామతీర్థం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రాజారత్నం, రాజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు అల్వకొండ బాబు (19) ఇటీవల ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేశాడు. కాగా పై చదువుల నిమిత్తం ఏ కోర్సులో చేరాలనే విషయంలో ఆందోళన చెందాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బనగానపల్లె ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

భయం గుప్పిట్లో బలపాల తిప్ప

- రెండవరోజు ఆవుల మందపై పెద్ద పులి దాడి
- లేగ దూడ మృత్యువాత
- భయాందోళనలో గ్రామస్తులు


పెద్దపులి పాదముద్రలు పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

కొత్తపల్లి: సంగమేశ్వరం సమీపంలోని బలపాల తిప్ప గ్రామంలో వరుసగా రెండోరోజు పెద్ద పులి ఆవుల మందపై దాడి చేయడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి కోడెదూడను బలి తీసుకుని పులి సోమవారం రాత్రి కూడా మరో లేగదూడను చంపేసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రాత్రి ఆవుల మంద వద్ద కాపలాగా నారాయణ ఉన్నాడు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పెద్దపులి రాకను గమనించిన ఆవులు బెదిరి గట్టిగా అరిచాయి. అక్కడే ఉన్న నారాయణ లేచి పెద్దపులిని గమనించి కేకలు వేశాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అరుపులు, కేకలు వేయడంతో పులి అక్కడి నుంచి వెళ్లిపోయింది. అప్పటికే పెద్దపులి దాడిలో లేగ దూడ చనిపోయింది. కాగా ఆవుల మంద నుంచి సుమారు 300 మీటర్ల దూరంలో పులి మాటు వేసి ఉండటంతో గ్రామస్తులు కేకలు వేయడంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది. అయితే మంగళవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో మళ్లీ వేట కొనసాగించేందుకు కొండ గట్టుపైకి చేరుకోవడంతో ప్రజలు గుర్తించి భయాందోళన చెందారు. వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక ఎఫ్ఎస్ఓ నాగేశ్వరరావు తన బృందంతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే పెద్దపులి అక్కడి నుంచి వెళ్లిపోయింది. అనంతరం ఎఫ్ఆర్ఓ పట్టాభి యాంటీ పోచింగ్ స్క్వాడ్ సుభాష్ సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన లేగ దూడను పరిశీలించి పరిసర ప్రాంతంలో పెద్దపులి ముద్రలను గుర్తించి అక్కడే ఉన్న కెమెరా ట్రాప్‌లను పరిశీలించారు. గ్రామస్తులు సహకరిస్తే పెద్దపులి రాకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అనంతరం వైద్యాధికారులు లేగ దూడ కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. సంఘటన స్థలంలో కెమెరా ట్రాప్‌లు ఉంచినా కూడా ఏదానిలో పెద్దపులి ఆచూకీ కనపడక పోవడంతో గ్రామస్తులు మరింత భయాందోళనకు గురవుతున్నారు.

● మూగ వేదన

తన కళ్ల ముందు గెంతులు వేస్తూ అటు ఇటు తిరిగిన లేగ దూడ విగత జీవిగా కనిపించడంతో తల్లి ఆవు తల్లడిల్లిపోయింది. పులి పంజాకు ప్రాణాలు విడిచిన దూడను తల్లి ఆవు లేపే ప్రయత్నం అక్కడి వారిని కన్నీరుపెట్టించింది. సృష్టిలో తల్లి ప్రేమకు మించినది ఏదీ లేదని, అది మనుషుల్లోనైనా, జంతువుల్లోనైనా ఒకటేనని ఈ ఘటన నిరూపించింది.


పెద్దపులి దాడిలో చనిపోయిన లేగ (ఆవు)దూడ కళేబరం వద్ద తల్లి ఆవు

బైక్ మెకానిజంలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులకు బైక్ మెకానిజంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల శిక్షణ కార్యక్రమం జూలై 13 నుంచి మొదలవుతుందన్నారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు వారై.. చదవడం, రాయడం వచ్చిన వారు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువకులు 90007 10508 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

అమెరికాకు బయలుదేరిన మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): నగర మేయర్ బీవై రామయ్య మంగళవారం అమెరికాకు బయలుదేరారు. అక్కడి డల్లాస్ నగరంలో ఈనెల 30 నుంచి వచ్చే నెల 2 వ తేదీ వరకు నిర్వహించనున్న నాసా (నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్) మహాసభల్లో ఆయన పాల్గొంటారు. తిరిగి జూలై 21 వ తేదీన కర్నూలు నగరానికి చేరుకుంటారు. అమెరికాకు బయలుదేరిన మేయర్‌కు క్యాంపు కార్యాలయంలో పలువురు కార్పొరేటర్లు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వీడ్కోలు పలికారు.

భారత్ విశ్వ గురువుగా ఎదుగుతోంది

కర్నూలు కల్చరల్: దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం విశ్వ గురువుగా ఎదుగుతోందని బీజేపీ జాతీయ ప్రధాన క్యాదర్శి దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. నంద్యాల జిల్లా మహాజన్ సంపర్క్ అభియాన్ బహిరంగ సభ మంగళవారం కర్నూలు సంతోష్‌నగర్‌లోని కర్నూలు కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ నరేంద్రమోదీ తొమ్మిది సంవత్సరాల పాలనలో జరిగిన దేశ అభివృద్ధి, రాష్ట్రానికి బీజేపీ ఏవిధంగా అండగా నిలిచిందో ఇలాంటి సభల ద్వారా ప్రజలకు వివరిస్తున్నామన్నారు. కాంగ్రెస్ 60 సంవత్సరాల పాలనలో ప్రతి రోజు స్కాంల గురించే మాట్లాడుకుంటే.. బీజేపీ అధికారం చేపట్టాక ప్రతి రోజు సంక్షేమ స్కీంల గురించే చర్చించుకునే రోజులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి శబరి, బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు బుడ్డా శ్రీకాంత్‌రెడ్డి, నంద్యాల పార్లమెంట్ ఇన్‌ఛార్జి రమేష్ నాయుడు, ఆళ్లగడ్డ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూమా కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్మనీలో స్టాఫ్ నర్సులుగా ఉద్యోగావకాశాలు

కర్నూలు(సెంట్రల్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) టీఏకేటీ ఇంటర్నేషనల్, ఏపీ ఎస్ఆర్‌టీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ చదువుకున్న అభ్యర్థులకు జర్మనీలో స్టాఫ్ నర్సుగా ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి వి.శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 20–35 ఏళ్ల వయసు కలిగి కనీసం 2 ఏళ్లపాటు సాధారణ ఆసుపత్రుల్లో అనుభవంతో జర్మన్ భాష నేర్చుకొనుటకు ఆసక్తి ఉండాలన్నారు. నర్సింగ్ గ్రాడ్యుయేషన్(బీఎస్సీ) పూర్తి చేసి ఉండాలని, విజయవాడ కేఎల్ విశ్వవిద్యాలయంలో జర్మన్ భాష శిక్షణ పై బీ1స్థాయి వరకు నిర్వహించబడే ఉచిత ఆన్‌లైన్ తరగతులకు తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంటుందన్నారు. భాషపై శిక్షణ అనంతరం జర్మనీలో పనిచేయడానికి ఆఫర్ లెటర్ వస్తుందన్నారు. అక్కడికి వెళ్లేందుకు విమాన చార్జీలు ఉచితంగా ఇస్తారన్నారు. ప్రారంభం వేతనం నెలకు వెయ్యి యూరోలు ఉంటుందని వివరించారు. ఆరు నెలల కాలంలో జర్మనీలో బీ2 పరీక్ష శిక్షణ ఇస్తారని, ఉత్తీర్ణత సాధించిన వారికి నెలకు 2500 యూరోలు జీతం అందుతుందన్నారు. శిక్షణ తరగతులు విజయవాడ సమీపంలోని కేఎల్ విశ్వ విద్యాలయంలో జూలై 1 నుంచి ప్రారంభమవుతాయన్నారు. వారానికి 48గంటలపాటు రెండు నెలలు శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు www.apssdc.inలో తమ పేర్లను జూన్ 30వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. కాగా, ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను helpline@apssdc.in మెయిల్ లేదా 8374231357, 9988853335 నంబర్లకు సెండ్ చేయాలని ఆయన సూచించారు.


పాఠశాలలో అడ్మిషన్లు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు


తరగతి గదిలో డెస్కులు చాలక కింద కూర్చున్న విద్యార్థినులు

బాహు బడి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లు సంఖ్య భారీగా పెరిగిపోయింది. దీంతో పాఠశాలలో దాదాపు విద్యార్థినుల సంఖ్య 3,065కు చేరినట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. కేవలం ఈవిద్యాసంవత్సరంలోనే 811 మంది అడ్మిషన్లు తీసుకున్నారు. అందులో 600 మంది 6వ తరగతిలో చేరారు. ప్రవేశాలు పెరగడంతో తరగతి గదులు విద్యార్థులతో కిటకిటలాడుతున్నాయి. ఒక్కో తరగతిని ఐదు,ఆరు సెక్షన్లుగా విడదీసి విద్యాబోధన సాగిస్తున్నారు. పాఠశాలలో ప్రస్తుతం మొత్తం 30 తరగతి గదులున్నాయి. మన బడి నాడు–నేడు రెండో విడతలో 20 గదులు మంజూరు కాగా ప్రస్తుతం 4గదుల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఒక్కో తరగతి గదిలో వంద మంది విద్యార్థినులను కూర్చొబెట్టి విద్యాబోధన సాగిస్తున్నారు. పాఠశాలలో 64 మంది ఉపాధ్యాయినులు పని చేస్తున్నారు. కాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి విద్యార్థినికి స్కూల్‌లో అడ్మిషన్లు ఇస్తామని ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి తెలిపారు.

చీరల బాక్సుల్లో మద్యం ప్యాకెట్లు

- కర్ణాటక నుంచి తీసుకొస్తుండగా పట్టుకున్న సెబ్ పోలీసులు
- మూడు కేసుల్లో నలుగురు అరెస్ట్, 1038 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం


పట్టుబడిన మద్యం, నిందితులను అరెస్ట్ చూపిస్తున్న సెబ్ సీఐ జయరాంనాయుడు

ఎమ్మిగనూరురూరల్: అక్రమార్కులు మద్యం దందాను వదలడం లేదు. పోలీసులకు అనుమానం రాకుండా కొత్తమార్గాలు అవలంబిస్తున్నారు. మంగళవారం సెబ్ పోలీసులు తనిఖీలు చేయగా చీరలు విక్రయించే అట్టపెట్టెల్లో టెట్రా ప్యాకెట్లను తరలిస్తూ ఇద్దరు, గుడిసెలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరలో మద్యం నిల్వ చేసి మరొకడు చిక్కాడు. సెబ్ సీఐ జయరాంనాయుడు నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. మంత్రాలయంలోని రామచంద్రనగర్‌కు చెందిన ఈడిగ జయరాముడు అనే వ్యక్తి తన గుడిసె పక్కన ప్రత్యేక అర ఏర్పాటు చేసి అందులో కర్ణాటక మద్యం నిల్వ చేసి గుట్టుగా విక్రయాలు జరుపుతున్నాడు. ఈమేరకు సమాచారం అందడంతో దాడి చేసి 654 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే తెల్లవారుజామున మంత్రాలయం నుంచి ఎమ్మిగనూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సుల్లో తనిఖీలు చేయగా ఆదోని రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన బోయ రాముడు, కోసిగికి చెందిన పీరాసాబ్ చీరలు పెట్టుకునే అట్ట బాక్సుల్లో 288 టెట్రా ప్యాకెట్లను ఉంచి సీల్ చేశారు. అనుమానం రాకుండా వాటిని బ్యాగ్‌లో పెట్టుకుని వస్తుండగా పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. అలాగే మంత్రాలయం మండలం చిలకలడోణకు చెందిన బాల నాగన్న అనే వ్యక్తి ఇంట్లో తనిఖీలు చేయగా 96 టెట్రా ప్యాకెట్లు లభించాయి. ఈ మూడు కేసుల్లో 1,038 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, నలుగురు నిందితులను రిమాండ్‌కు పంపినట్లు సీఐ వెల్లడించారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ సోమశేఖర్‌రావు, హెచ్‌సీలు గోపాల్, లింగప్రసాద్, చంద్రమౌళి, కానిస్టేబుళ్లు, నరసింహారెడ్డి, రామచంద్రుడు, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.


మంత్రాలయంలో ప్రత్యేక అర నుంచి మద్యం ప్యాకెట్లు బయటకు తీస్తున్న దృశ్యం

ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై వేటు

కర్నూలు(అగ్రికల్చర్): వెల్దుర్తి మండలం రామళ్లకోట ఫీల్డ్ అసిస్టెంట్ వడ్డ శివన్న, టెక్నికల్ అసిస్టెంట్ జె.రాజశేఖర్‌పై జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి మంగళవారం సస్పెన్షన్ వేటు వేశారు. ఈ ఇద్దరు విధి నిర్వహణలో నిర్లక్ష్యంతో పాటు అవినీతి ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫీల్డ్ అసిస్టెంట్ ఒక వర్గం వారికే పనులు కల్పిస్తుండటం, కొత్త జాబ్‌కార్డుకు రూ.1000 వసూలు చేస్తున్నాడు. దీనిపై గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. సాంకేతిక సహాయకుడు రాజశేఖర్ కూడా విధి నిర్వహణలో పూర్తిగా అలసత్వం వహించినట్లు విచారణలో స్పష్టమైంది.

రేపు గనులశాఖ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ గనులశాఖ రిటైర్డ్ అధికారులు, ఉద్యోగుల ఆత్మీయ సమావేశం ఈ నెల 29వ తేదీన బెంగళూరు హైవే ఎన్‌హెచ్ 44లో ఉన్న అమెజాన్ రిసార్ట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా గనుల శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

ఉత్తమ సేవలకు ప్రశంస

- మహిళా పోలీసుల సేవలను కొనియాడిన డీజీపీ
- ప్రోత్సాహక నగదు అందజేత



జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచి డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మహిళా పోలీసు కె. జ్యోతి (ఆదోని వన్‌టౌన్)

కర్నూలు (టౌన్): ఉమ్మడి జిల్లాలో గ్రామ, వార్డు మహిళా పోలీసుల సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో పోలీసు శాఖకు విశేష సేవలు అందించిన మహిళా పోలీసులను డీజీపీ ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక నగదు అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు స్థాయిల్లో మహిళా పోలీసులు పనిచేయడం ద్వారా ఎన్నో మిస్సింగ్ కేసులు ఛేదించామని, గుర్తు తెలియని మృతదేహాలను గుర్తించగలిగామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు తగ్గడంలో మహిళా పోలీసుల పాత్ర ఉందన్నారు. ఈ సమావేశంలో కర్నూలు రేంజ్ డీఐజీ ఎస్. సెంథిల్ కుమార్, కర్నూలు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, నంద్యాల ఎస్పీ కె. రఘువీరారెడ్డి, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పాల్గొన్నారు.


ధనలక్ష్మి (పత్తికొండ పీఎస్), త్రివేణి (దేవనకొండపీఎస్), యశోద (వెల్దుర్తి పీఎస్), రూపాదేవి (ఆస్పరి పీఎస్), హైమావతి (ఆదోని టూ టౌన్), డి. లక్ష్మి (ఇస్వీ పీఎస్), కె. శారద (ఇస్వి పీఎస్)
సుచిత్ర (గోనెగండ్ల పీఎస్), కె. శాలిని (గోనెగండ్ల పీఎస్), బి. వీణాదేవి (పత్తికొండ పీఎస్), కె. రంగమణి (మంత్రాలయం పీఎస్), ఎం. నసీమున్నీసా (కర్నూలు టూ టౌన్), ఉమామహేశ్వరి (కర్నూలు టూ టౌన్), సాయిరమ్య (కర్నూలు టూ టౌన్)
ఎస్. అస్మాజాబిన్ (కర్నూలు వన్‌టౌన్), ఎం. మధులత (నంద్యాల తాలూకా), మైమున్నీసాబేగం (ఆత్మకూరు), ఎంవీ నారాయణమ్మ, (నంద్యాల టూ టౌన్), వైవీ లక్ష్మీదేవి (బేతంచర్ల పీఎస్), యశోద లక్ష్మి (డోన్ పీఎస్), డి. భారతి (నంద్యాల త్రీ టౌన్ పీఎస్)